# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈరోజు నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు విభాగాల వారీగా పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది.**

**2.** **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు ఐఏఎస్‌లతోపాటు, ఆరుగురు ఐపీఎస్ అధికారులను ఎన్నికల సంఘం బదిలీ చేసింది.**

**3.** **తెలంగాణా రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ- 2024 పరీక్ష కోసం దరఖాస్తులు సమర్పించే గడువును రాష్ట్ర విద్యా శాఖ జూన్ 20వ తేదీ వరకు పొడిగించింది.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో ఐదు లోక్‌సభ, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు పేర్కొంది.**

**5.** **ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో “ మంచినీటి విరామం” ఇవ్వాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ –సెర్ప్ సీఈఓ ఆదేశాలను సవరిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ రోజు నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు విభాగాల వారీగా పంపిణీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. కొందరికి ఇంటివద్దే ఇవ్వడంతోపాటు, మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారు, అస్వస్థతకు గురైనవారు, వితంతువులకు ఇంటివద్దే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ సచివాలయాలకు చాలా దూరంగా ఉన్న గిరిజన ప్రాంతాల వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది.ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.27 లక్షల సిబ్బంది ఉన్నట్టు గుర్తించిన ప్రభుత్వం.. రెండు కేటగిరీలుగా పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సచివాలయాలు పనిచేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ రోజు మధ్యాహ్నం నుంచి ప్రారంభించి ఏప్రిల్ 6 నాటికి పింఛన్ల పంపిణీ ముగించాలని ఆదేశించింది.

--------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ముగ్గురు ఐఏఎస్‌లతోపాటు, ఆరుగురు ఐపీఎస్‌లను బదిలీ చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. బదిలీ ఐన ఐపీఎస్‌లలో ప్రకాశం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డి, చిత్తూరు ఎస్పీ జాషువా, అనంతపురం ఎస్పీ అన్బురాజన్, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉన్నారు.ఆయా జిల్లాల ఎస్పీలను ఎన్నికలకు సంబంధం లేని ఉద్యోగాల్లో నియమించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఐఏఎస్ అధికారుల్లో కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి రాజబాబు, అనంతపురం జిల్లా అధికారి గౌతమి, తిరుపతి ఎన్నికల అధికారి లక్ష్మీశా ఉన్నారు. బదిలీ అయినవారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికలసంఘం ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ- 2024 పరీక్ష కోసం దరఖాస్తులు సమర్పించే గడువును రాష్ట్ర విద్యా శాఖ జూన్ 20వ తేదీ వరకు పొడిగించింది. 11 వేల 62 మంది ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే గడువు నిన్నటితో ముగిసింది. తాజాగా పొడిగించిన గడువు ప్రకారం అభ్యర్థులు వెయ్యి రూపాయల దరఖాస్తు రుసుముతో జూన్ 20వ తేదీ రాత్రి 11 గంటల 50 నిమిషాల వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు సమర్పించవచ్చు. కాగా .... జూలై 17 నుండి 31 వ తేదీ వరకు ఆన్ లైన్ పరీక్షలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర నిన్న చిత్తూరు జిల్లాకు చేరుకుంది. నిన్న బస చేసిన అమ్మగారిపల్లె ప్రాంతం నుంచి ఈరోజు బయలుదేరి సదుం, కల్లూరు, దామలచెరువు, తలుపులపల్లి మీదుగా తేనెపల్లి చేరుకుంటారు. అనంతరం రంగంపేట క్రాస్ మీదుగా మధ్యాహ్నం పూతలపట్టు బైపాస్కు చేరుకుని.. అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఇలా ఉండగా.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో నిన్న జరిగిన సభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ .... సంక్షేమం అంటేనే తమ ప్రభుత్వం పేరు గుర్తుకు వస్తుందని స్పష్టం చేశారు. లంచాలు , వివక్ష లేని పాలన అందించి ... రైతులు , సాధారణ ప్రజానీకం మద్దతు సంపాదించామని తెలిపారు.

---------------------------

లోక్‌సభ ఎన్నిలకు కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తుందని తెలంగాణా పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. తుక్కుగూడలో ఏప్రిల్ 6 వ తేదీ నిర్వహించనున్న 'జనజాతర' సభ ఏర్పాట్లను మంత్రులు, పార్టీ నేతలతో నిన్న కలిసి పరిశీలించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... జనజాతర సభకు ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరుకానున్నారని తెలిపారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తెలంగాణకు ఇవ్వనున్న ప్రత్యేక నిధులు, అనుమతులను మేనిఫెస్టోలో పొందుపరుస్తామని చెప్పారు.తుక్కుగూడ సభలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ 5 గ్యారంటీలను ప్రకటించనుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పించన్ల పంపిణీపై తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు భారత

ఎన్నికల సంఘానికి  లేఖ రాశారు. సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ దారులు  దూరం వెళ్లాల్సి వస్తోందని... ఈ కారణంగా అందుబాటులో ఉన్న సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బంది ద్వారా వెంటనే లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ఎన్నికల సంఘం  ఆదేశాలు ఇవ్వాలి అని లేఖలో పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఐదు లోక్‌సభ, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నిన్న విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. కాకినాడ నుండి పల్లం రాజు, రాజమండ్రి నుండి గిడుగు రుద్రరాజు, బాపట్ల నుండి జేడీ శీలం, కర్నూలు నుండి పీజీ రాంపుల్లయ్య యాదవ్ లోక్ సభ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ  ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో " మంచినీటి విరామం" WATER BREAK ఇవ్వాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులలో డి హైడ్రేషన్ ముప్పు నివారించే ఉద్దేశ్యంతో ఉదయం  8 గంటల 45 నిమిషాలు ....., 10 గంటల 5 నిమిషాలు ...., 11 గంటల 50 నిమిషాలకు మంచి నీరు తాగడం కోసం విద్యార్థులకు విరామం ఇవ్వాలని విద్యా శాఖ పేర్కొంది. విద్యార్థులు క్రమం తప్పకుండా మంచి నీరు తాగడం ద్వారా ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది.  ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటి పూట బడులు జరుగుతున్నాయి.

---------------------------

ఉగాది పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికుల కోసం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ – ఏపీఎస్ఆర్టీసీ  అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 5, 6వ తేదీలలో ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆయన ఒక ప్రకటలో పేర్కొన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించవచ్చన్నారు. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతితో పాటు రాష్ట్ర పరిధిలోని అన్ని ప్రధాన నగరాలకు బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

ఐపీఎల్ మ్యాచ్‌ల్లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఈరోజు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ ఈరోజు మ్యాచ్ జరుగనుంది. నిన్న బెంగళూరు వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై విజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కాగా ఐపీఎల్ షెడ్యూల్‌లో రెండు మ్యాచ్‌ల తేదీలలో మార్పు చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది.  ఈ నెల  17 కోల్‌కతాలోని  ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ ను ఒక రోజు ముందు  ఏప్రిల్ 16 నిర్వహించనున్నట్లు తెలిపింది.అలాగే, ఈ నెల  16న అహ్మదాబాద్  వేదికగా  గుజరాత్ టైటాన్స్  ఢిల్లీ క్యాపిటల్స్  జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్.. ఏప్రిల్ 17న జరగనుందని  తెలిపింది.

--------------------------

తెలంగాణ రైతులకు భరోసా కల్పించేదుకే రైతు దీక్ష చేపట్టామని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిన్న రైతు దీక్ష చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుగు, తేమతో సంబంధం లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. ఆకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్ర పంటల బీమా పథకాన్ని, కేంద్ర ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు.

--------------------------

లోక్‌సభ ఎన్నికల్లో అసత్య సమాచార వ్యాప్తిని అరికట్టడానికి కేంద్ర ఎన్నికల సంఘం మిథ్ వర్సెస్ రియాలిటీ రిజిస్టర్ పేరుతో ఓ వెబ్‌సైట్‌ను రూపొందించింది. ఈ వెబ్ సైట్‌ను కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధు కలిసి ప్రారంభించారు.

======================